జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

శుక్రవారం 14 ఆగస్టు 2026 పేజీలు:12






## డంపింగ్ యార్డ్ పనులను వెంటనే నిలిపివేయాలి

- జనవాసాలకు దూరంగా తరలించాలని
- ఆర్డీవో, ఎంపీడీవోలకు వినతి
- అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్

2..




## 24 గంటల్లో నిందితుల ఆటకట్టిస్తాం!

- రూపా రెడ్డి హత్య కేసు దర్యాప్తు ముమ్మరం..

రంగంలోకి 3 ప్రత్యేక బృందాలు - సీసీ ఫుటేజ్ ఆధారంగా నేరస్తుల కోసం వేట - కొండమల్లేపల్లిలో ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించిన - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

2..



## స్వాతంత్ర్య దినోత్సవ క్రీడల పోటీల్లో ఘోర విషాదం

- భువనగిరి ప్రభుత్వ బాగాయత్ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థిని మృతి
- పలువురు విద్యార్థులకు గాయాలు..
- విద్యార్థి కుటుంబానికి 50 లక్షలు పరిహారం ఇవ్వాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం








భువనగిరి క్రైమ్ ఆగస్ట్8 (ప్రజాజ్యోతి)

భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాగాయత్ పాఠశాలలో గురువారం విషాదకర ఘటన చోటు చేసుకుంది.పాఠశాల ఆవరణలో ఉన్న భారీ వేపచెట్టు ఒక్కసారిగా విరిగి పడటంతో 3వ తరగతి విద్యార్థిని అలీనా (8) అక్కడికక్కడే మృతి చెందింది.

మిగతా 2 లో

## ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ గా

### – బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్

మిర్యాలగూడ,ఆగష్టు 13, ( ప్రజాజ్యోతి):

ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.తెలంగాణ శాసన మండలిలో జరిగిన ప్రభుత్వ హామీల కమిటీ (202627) ప్రాథమిక సమావేశంలో చైర్మన్‌గా పాల్గొని కమిటీ కార్యకలాపాలపై చర్చించారు.

మిగతా 2 లో



# డంపింగ్ యార్డ్ పనులను వెంటనే నిలిపివేయాలి

మొదటిపేజీ తరువాయి

చౌటుప్పల్, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి)

లింగోజిగూడెం రెవిన్యూ సర్వే నంబర్ 326లోని స్మశానవాటిక ప్రక్కన నివాస ప్రాంతాల వద్ద నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్ పనులను వెంటనే నిలిపివేయాలని అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం రోజున చౌటుప్పల్ ఆర్డీవో వి. శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో వీరాబాయి, మండల పరిషత్ అధికారి కే. శ్రీలతలకు స్థానికులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చౌటుప్పల్ మున్సిపాలిటీ నుంచి సేకరించిన చెత్తను లింగోజిగూడెం రెవిన్యూ పరిధిలోని కాంశెట్టి పెంటయ్య బావి నుండి బిస్కెట్ల కంపెనీ వెనుక భాగం వరకు ఉన్న స్థలంలో నిల్వ చేయడానికి డంపింగ్ యార్డ్ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. జనవాసాలు, పాఠశాలలకు సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్ర రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. నిర్మిస్తున్న పనులను వెంటనే నిలిపివేసి, నివాస ప్రాంతాలు మరియు పాఠశాలలకు కనీసం 2 కిలోమీటర్ల దూరంలో ఇతర ప్రాంతాలకు డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొడ్డ అండాలు శెట్టయ్య గౌడ్, బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, పర్నే శ్రీధర్ రెడ్డి, భీమగోని మల్లేశం గౌడ్, గంగాపురం పాండు గౌడ్, పంచాయతీ కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ క్రీడల పోటీల్లో ఘోర విషాదం

మొదటిపేజీ తరువాయి

ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు.సమాచారం అందుకున్న ఉపాధ్యాయులు, స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన విద్యార్థులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశించారు.ఈ ఘటనతో పాఠశాలలో విషాద ఛాయలు అలుము కున్నాయి.విద్యార్థిని మృతి పట్ల ఉపాధ్యాయులు,తల్లి దండ్రులు,తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.స్థానికులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో విద్యార్థులందరూ పాఠశాల ప్రాంగణంలో ఉండే అవకాశం ఉన్నందున,ప్రమాదం ఆ రోజు జరిగి ఉంటే మరింత పెద్ద విషాదం చోటుచేసుకునేదని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్లు,నిర్మాణాలను గుర్తించి వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు.ఘటనపై ఆర్డీఓ కృష్ణ రెడ్డి ఇతర అధికారులు విచారణ చేపట్టి ప్రమాదానికి గల కారణాలను తెలుసు కుంటున్నారు.

### తాగుబోతులకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల

గత వారం క్రితం కొంతమంది అర్ధరాత్రి చెట్టుకు నిప్పు పెట్టడంతో ఉదయం 10 గంటలకు చెట్టులో మంటలు రావడానికి గమనించిన విద్యార్థులు పాఠశాల అధ్యాపకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. అప్పుడే ఆ కొమ్మును తొలగించి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని తల్లిదండ్రులు విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే 50 లక్షల పరిహారం అందించాలని బిఆర్ఎస్, వామపక్ష నాయకులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు

# 24 గంటల్లో నిందితుల ఆటకట్టిస్తాం!



మొదటిపేజీ తరువాయి

కొండమల్లేపల్లి, ఆగస్టు 13,(ప్రజాజ్యోతి):



నాగార్జున గ్రామర్ పాఠశాల ప్రిన్సిపాల్ కల్లు రూపా రెడ్డి దారుణ హత్య కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసు యంత్రాంగం దర్యాప్తులో వేగం పెంచింది. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను పట్టుకునేందుకు వల పన్నింది. నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ గురువారం కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం జేపీ కాలనీలోని హత్య జరిగిన రూపా రెడ్డి నివాసానికి చేరుకుని, ఘటనా స్థలాన్ని నిశితంగా పరిశీలించారు.హత్య జరిగిన తీరు, నిందితులు తప్పించుకున్న మార్గాలపై ఆరా తీశారు.ముఖ్యంగా ఇంటి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలతో పాటు, ఆ వీధిలో ఉన్న ఇతర కెమెరాలను, భౌగోళిక అంశాలను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాలనీలోని సీసీటీవీ వీడియో ఫుటేజీ ఆధారంగా నిందితుల కదలికలను ట్రాక్ చేస్తున్నట్లు వెల్లడించారు.మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జరిగిన ఈ దారుణ హత్య వెనుక ఉన్న దుండగులను పట్టుకోవడానికి దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక నిఘా బృందాలను రంగంలోకి దించినట్లు ఎస్పీ ప్రకటించారు.దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. నేరస్తులు ఎక్కడున్నా తప్పించుకోలేరు. కేవలం 24 గంటల్లోనే నిందితులను పట్టుకుని తీరుతాం. ఆ తర్వాత కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడిస్తాం అని ఆయన స్పష్టం చేశారు.పకడ్బందీగా సాగుతున్న ఈ దర్యాప్తు పరిశీలనలో జిల్లా ఎస్పీ వెంట దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్, చింతపల్లి ఎస్సై రామ్మూర్తి తదితర పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, కమిటీ సభ్యులు భానుప్రసాద్, రవీందర్, మధుసూదన్, లెజిస్లేటివ్ సెక్రటేరియట్ అధికారులు నరసింహాచారి, తిరుపతి ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ కు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ప్రభుత్వం శాసనసభలో ఇచ్చిన హామీల అమలును సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలు సకాలంలో నెరవేరేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తెలిపారు.

# నకిరేకల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

**నకిరేకల్ ఆగస్టు 13 ప్రజా జ్యోతి**




నకిరేకల్: అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు నకిరేకల్ మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల సూర్యవర్ ఆధ్వర్యంలో నకిరేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మంజుల సూర్యవర్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి యువజనులని, తమ



హక్కుల కోసం అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. దేశ భవిష్యత్తు, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమ విధులను అంకితభావంతో నిర్వర్తించాలని, దేశాన్ని అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పిస్తూ, ఉచిత న్యాయ సహాయం (ఫ్రీ లీగల్ ఎయిడ్) అందుబాటులో ఉందని, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. మంచి కెరీర్‌ను ఎంచుకుని, నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని కష్టపడి చదివి అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి ముద్దసాని నీలిమ మాట్లాడుతూ.. జీవితంలో ఏదైనా సాధించాలంటే మన నడవడిక, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులను గౌరవించాలని, ప్రతిరోజూ వార్తాపత్రికలు చదువుతూ సాధారణ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొండా యాదగిరి, అక్కినేపల్లి వీరస్వామి, నూకల మల్లేశం, పగడాల మీరా మనోహర్, బల్లెం ఉదయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. రాములు, ఉపాధ్యాయులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది సింగం సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రి పంపిణీ

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):**





సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రూ.10000 వేల రూపాయల విలువైన క్రీడా సామగ్రిని గురువారం అందజేశారు. క్రీడల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ యువ నాయకులు దిర్శనపు సందీప్ ఈ క్రీడా సామగ్రిని పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. పాఠశాలకు అందించిన క్రీడా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. క్రీడా సామగ్రిని అందించిన దిర్శనపు సందీప్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వెంకయ్య, కే. చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్, మురళీధర్, సిద్ధు (పీ. ఈ. టీ), విజయలక్ష్మి, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లూ జాగ్రత్త..

### SIR పేరుతో సైబర్ మోసాలు

- అనుమానాస్పద లింక్‌లు క్లిక్ చేయొద్దు
- ఈసీఐ పేరుతో వచ్చే మెసేజ్‌లను నమ్మొద్దు
- చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్



**చౌటుప్పల్, ఆగస్టు 13 ( ప్రజా జ్యోతి ):**

SIR (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ నేపథ్యంలో ఓటర్లను సైబర్ నేరగాళ్లు మోసం చేసే అవకాశం ఉందని చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ హెచ్చరించారు. ఓటరు వివరాలు సరిచూసుకునే క్రమంలో ఎలక్షన్ కమిషన్ పేరుతో వచ్చే నకిలీ మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'మీ అప్లికేషన్ రిజెక్ట్ అయింది.. రీ-ప్రాసెస్ చేసేందుకు డబ్బులు చెల్లించాలి' అంటూ సైబర్ నేరగాళ్లు మోసపూరిత సందేశాలు పంపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఎలాంటి రుసుములు చెల్లించాలంటూ ఫోన్ కాల్స్ లేదా మెసేజ్‌లు చేయదని స్పష్టం చేశారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లలోని లింక్‌లను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వాటిని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్‌స్టేషన్‌ను కూడా ఆశ్రయించాలని సీఐ కోరారు.

## బోనమెత్తిన మహిళలు.. పులకించిన అన్నారం

- పాడిపంటలు పుష్కలంగా పండాలని.. అమ్మవారికి మొక్కిన మహిళలు

**తుంగతుర్తి, ఆగస్టు 13,(ప్రజా జ్యోతి):**



మండల పరిధిలోని అన్నారం గ్రామంలో సంస్కృతిలో భాగమైన గ్రామ దేవత అయిన ఊర ముత్యాలమ్మ కు మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో గురువారం బోనాలు సమర్పించుకున్నారు. ఆషాఢ మాసం సందర్భంగా గ్రామస్తులు మహిళలు కుటుంబ సమేతంగా కొత్త కుండలో బోనాలు తయారు చేసి సాంప్రదాయ వస్త్రాదానతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు .మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాల కుండలను ఇంటి వద్ద నుంచి డప్పు వాయిద్యాల నడుమ గ్రామ దేవత అయిన ఊర ముత్యాలమ్మకు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఊరి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించి ఎలాంటి అంటువ్యాధులు రాకుండా గ్రామ దేవత కాపాడాలని భక్తితో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ సరిత, వార్డు సభ్యులు బింగి వెంకటేశ్వర్లు ,మరికంటి శ్యాంప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ దొంగరి శ్రీనివాస్, వేణు కృష్ణమూర్తి చిత్తలూరి సోమశేఖర్, సోమయ్య, స్థానిక ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# దళిత డిక్లరేషన్ అమలు చేయాలి



**తుంగతుర్తి, ఆగస్టు 13,(ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అధికారం రావడం కోసం చేవెళ్ల లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే తో 12 కీలక అంశాలతో దళిత డిక్లరేషన్ విడుదల చేసి అధికారం వచ్చి మూడేళ్లయిన అమలకు నోచుకోలేదని టిఆర్ఎస్ పార్టీ దళిత నాయకులు మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో దళిత డిక్లరేషన్ అమలు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చి ఇంత కాలమైనా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంపై మండిపడ్డారు. దళిత గిరిజన వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తామన్న ఆకర్షణీయమైన హామీలు అప్పట్లో యువతకు ఎన్నో ఆశలు రేకెత్తించాయని అన్నారు. దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతామని కాంగ్రెస్ పార్టీ నమ్మించి వమ్ము చేసిందని మండిపడ్డారు.అంబేద్కర్ అభయహస్తం పేరుతో చెప్పిన రూ.12 లక్షల ఆర్థికసాయం కాని, విదేశాల్లో చదువుకున్న దళిత విద్యార్థులకు 20లక్షల ఓవర్సీస్ స్కాలర్షిప్ లాంటి ఏ ఒక్క వాగ్దానాన్ని కూడ అమలు చేయలేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొట్లాది రూపాయలు నిధులు విడుదల చేసి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పి మూడేండ్ల అయిన ఒక్కరూపాయి కూడ కార్పొరేషన్ ద్వారా దళిత కుటుంబాలకు అందించలేదని అన్నారు. రాష్ట్రం లో అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకపోగా ప్రజాపాలన పేరుతోదగా పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభత్వానికి పార్టీకి భవిష్యత్ లో తగిన గుణ పాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్, వెంపటి, గానుగ బండ సర్పంచులు తప్పట్ల ఎల్లయ్య, మాతంగి వెంకటమ్మ కరుణాకర్, మల్లెపాక రాములు,గోపగాని రమేష్ పూర్ణ నాయక్,వీరోజీ నాయక్. సుధాకర్ నాయక్,భాస్కర్,కదారిదాసు సోమయ్య, ప్రవీణ్, భాస్కర్, శ్రీనివాస్, రాములు,సోమేశ్, కరుణాకర్, విజయ్,శ్రవణ్.పరుశురాం,శ్యామ్,పోలేపాక రాజేష్, సాయి, పరమేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# భారత దేశ నమూనాలో క్రిష్ణవేణి విద్యార్థులు



**రామన్నపేట ఆగస్టు 13( ప్రజా జ్యోతి)**

ఈ నెల 15 న జరుగబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు గురువారం వినూత్నంగా తమ పాఠశాల ప్రాంగణంలో భారత దేశ నమూనాను ప్రదర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులచే వినూత్నంగా నిర్వహించిన భారత దేశ నమూనా ప్రదర్శన పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. వినూత్నంగా ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె. మణి అభినందించారు.

## కుమ్మరోళ్ళను గ్రామదేవతల ఆలయాల వద్ద

# పూజారులుగా నియమించాలి



**తుంగతుర్తి, ఆగస్టు 13,(ప్రజా జ్యోతి):**

గ్రామ దేవతల ఆలయాల వద్ద కుమ్మరోళ్ళను పూజారులుగా నియమించి వారికి ప్రభుత్వం తరఫున నెలకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మార్కండేయ భవనంలో తుంగతుర్తి మండలం లోని 16 గ్రామాల ప్రతినిధుల సర్వసభ్య సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడి కూడ జయంత రావు నాయకత్వంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ మరియు రాష్ట్ర కమిటీ సూచనల మేరకు జిల్లా కన్వీనర్ చలిగంటి వెంకటేష్ సమక్షంలో నియోజకవర్గ ఇన్చార్జి కోటమర్తి శ్రీనివాస్ అధ్యక్షతన 16 గ్రామాల కమిటీల తోపాటు యువజన కమిటీలను ఏకీగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తుంగతుర్తి మండల అధ్యక్షునిగా మద్దికుంట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, యూత్ అధ్యక్షునిగా మద్దికుంట్ల రవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ... గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారని తెలిపారు. గ్రామ దేవతల ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించే బాధితులను కుమ్మరోళ్ల కు కల్పించడం ద్వారా సామాజిక సమానత్వాన్ని మరింత బలోపేతం చేయవచ్చు అన్నారు. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు ఆలయ వ్యవస్థలను సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వీరేంద్ర, కోదాడ ఇన్చార్జి రామారావు, ఖమ్మంపాటి మధుసూదన్, నాగయ్య, లింగయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## - 21న జిల్లా కేంద్రాల్లో ధర్నా..
## 29న హైదరాబాద్ లో భారీ నిరసన.
## .- స్పందించకుంటే 'చలో అసెంబ్లీ'

**తుంగతుర్తి, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి):**

ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తుంగతుర్తి మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ దయానందం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ నాయకులు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి, తుంగతుర్తి మండల అధ్యక్షుడు మల్లెపాక రవీందర్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు కాచుగల్ల నవీన్ ప్రసాద్ మాట్లాడుతూ... పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు దాటినా ప్రభుత్వం జాప్యం చేస్తోందని అన్నారు. పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించి 2023 జూలై నుంచి అమలు చేయాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పున రుద్ధరించా లని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించాలని, ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారిన అశాస్త్రీయమైన జీవో 25ను రద్దు చేయాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, స్థానికత కోల్పోయిన 317 జీవో బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కారం చూపాలని అన్నారు. ఆందోళనల కార్యాచరణ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 21న జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని, 29న హైదరాబాద్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని నాయకులు హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ మండల నాయకులు మందడి సూర్యప్రకాష్, బీవనపల్లి శ్రీనివాస్, కోట స్టాలిన్, గుండ్ల ఆంజనేయులు, కొమ్ము గణేష్, జీడి అనిల్‌కుమార్, బరిగెల నవీన్‌కుమార్, బానోతు రవికుమార్, గుండగాని సుధాకర్, దరావత్ బాలాజీ, షేక్ హబీబ్, ఉబ్బపల్లి బాలయ్య, చంద్రకళ, బండారు మమత, మేధం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయుడి సేవలు అభినందనీయం




## - 15 ఏళ్లుగా విద్యార్థుల అభ్యున్నతికి కృషి
## - రిటైర్మెంట్ పొందిన శ్రీనివాస్‌శెట్టికి ఘన సన్మానం - సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం
## - సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్

**చౌటుప్పల్, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి)**

విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేసిన ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ శెట్టి సేవలు మరువలేనివని సర్పంచ్ గిర్కటి నిరంజన్‌గౌడ్ అన్నారు. దండు మల్కాపూర్ మండల పరిషత్ పాఠశాలలో 15 ఏళ్లపాటు విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్‌శెట్టిని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. విద్యాబోధనతోపాటు విద్యార్థులకు నైతిక విలువలు నేర్పిన శ్రీనివాస్‌శెట్టిని అభినందించారు. రిటైర్మెంట్ తర్వాత కూడా ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటేశారు.. గెలిపించారు. "లిటిల్ ఫ్లవర్‌లో ఓటు పండుగ"

## - విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి
## - పాఠశాల కరస్పాండెంట్ చెరుకు లింగస్వామి




**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి)**

పట్టణ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు పాఠశాల ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పదవులకు పోటీ చేసిన అభ్యర్థులు తమ అభిప్రాయాలు, లక్ష్యాలను తోటి విద్యార్థులకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. విద్యార్థులు తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేశారు. ఎన్నికల ప్రక్రియను క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించి అనంతరం ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చెరుకు లింగస్వామి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. పాఠశాల ఎన్నికలు విద్యార్థులకు మంచి అనుభవాన్ని అందించాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళావతి, ఉమ, కుసుమాంజలి, స్పందన, స్వప్న, మేఘమాల, శృతి, పావని, సంతోష, లావణ్య, అంజలి, ఐశ్వర్య, రమ్య, శిల్ప, సంధ్యారాణి, దీపన, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ భావాన్ని పెంపొందించాలి

## - బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్

## - జూలూరులో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి)**

మండలంలోని జూలూరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పిలుపు, జిల్లా ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు మేకల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడుకోవడంతో పాటు ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చెక్క కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు పల్లెకాడి బసవయ్య, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చెరుకు వెంకటేష్, పట్టణ కౌన్సిలర్ శ్రీరామ్ మంజుల లింగస్వామి, జిల్లా హర్ ఘర్ తిరంగా కో-కన్వీనర్ సీత మానస మణికంఠ, మాజీ మండల అధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ముద్దం హరీష్, గంగాదేవి విజయ్, ఉప్పునూతల నరసింహ, రామిడి యాదిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



# గుడిపల్లి మండల సర్వసభ్య సమావేశం హాజరైన ముఖ్య అతిథి దేవరకొండ శాసనసభ్యులు రామవతు బాలు నాయక్



**దేవరకొండ, గుడిపల్లి, ఆగస్టు 13,(ప్రజా జ్యోతి):**

దేవరకొండ నియోజకవర్గంలోని గుడిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు రమావత్ బాలు నాయక్ ని గుడిపల్లి గ్రామ సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుడిపల్లి గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన ప్రధాన అంశాలు తాగునీటి ఇబ్బందులు గ్రామంలోని కొన్ని కాలనీలలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించేందుకు అదనపు పైప్‌లైన్లు, కొత్త బోర్‌వెల్స్ మంజూరు చేయాలి. వైకుంఠధామం పనులు: గ్రామంలో నిర్మిస్తున్న శ్మశానవాటిక (వైకుంఠధామం) పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన మిగిలిన నిధులను విడుదల చేయాలి.సి సి రోడ్లు మరియు మురుగునీటి కాలువలు, గ్రామ అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడానికి నూతన సిసి రోడ్లతో పాటు, మురుగునీరు నిల్వ ఉండకుండా కొత్త డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలి.రహదారుల కనెక్టివిటీ పొలాలకు వెళ్లే దారులను మరియు పక్క గ్రామాలను కలిపే లింక్ రోడ్లను బాగు చేయాలి.ఎమ్మెల్యే బాలు నాయక్ హామీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి అందించిన వినతిపత్రంపై ఎమ్మెల్యే బాలు నాయక్ సానుకూలంగా స్పందించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గుడిపల్లి గ్రామంలో ఉన్న సమస్యల తీవ్రతను బట్టి, ప్రాధాన్యత క్రమంలో తగిన నిధులు మంజూరు చేసి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని సర్పంచ్‌కు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గుడిపల్లి గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# ప్రహారీ గోడ నిర్మాణం కోసం

## - ప్రకృతివనం ధ్వంసం చేసిన కాంట్రాక్టర్

## - మండల పరిషత్ ఆవరణలో జరిగిన పట్టించుకోని అధికారులు - జె సి బి ని అడ్డగించి అధికారులను పిలిపించిన గ్రామస్తులు

**పాలకవీడు, ఆగస్టు 13(ప్రజా జ్యోతి ):**

గత ప్రభుత్వం పల్లెల్లో ప్రకృతి ఆహ్లాదాన్ని పంచాలనే ఉద్దేశంతో నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు నేడు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు పల్లె ప్రకృతి వనాలు ప్రతీకలని భావించి దాదాపు లక్షల్లో వెచ్చించి గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను నిర్మించింది. రంగురంగుల పూల మొక్కలు, వివిధ రకాల అందమైన మొక్కలు ఆహ్లాదాన్ని పంచే పచ్చదనంతో కళకళలాడిన ప్రకృతి వనాలు నేడు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. వివరాలలోకి వెళితే సూర్యాపేట జిల్లా పాలకీడు మండల కేంద్రంలో ఉన్న పల్లె ప్రకృతి వనం గత ప్రభుత్వ హయాంలో గ్రామ పరిధిలో సుమారు అరెకరం స్థలాన్ని కేటాయించి, సుమారు రూ,4 లక్షల అంచనా వ్యయంతో వందల మొక్కలతో ఆధునిక హంగులతో అప్పటి పంచాయతీ పాలకవర్గం పల్లె ప్రకృతి వనాన్ని నిర్మించింది. కాగా పల్లె ప్రకృతి వనాన్ని ఆనుకొని ఉన్న కేజీబీవీ ప్రభుత్వ పాఠశాల భవనం ప్రహరీ కోసం ఓ కాంట్రాక్టు గ్రామ పంచాయతీ లో ఎలాంటి అనుమతులు లేకుండా పల్లె ప్రకృతి వనాన్ని జేసీబీ తో తొలగించి ప్రకృతి వనం ఆనవాళ్లు పూర్తిగా తొలగించింది. దీంతో స్కూల్ ప్రహరీ నిర్మాణం సరే పల్లె ప్రకృతి వనం తొలగించడమేంటని గ్రామస్తులు, ప్రకృతి ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కార్యదర్శి వివరణ

కాంట్రాక్టర్ కు నేను ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు లేకండా ప్రభుత్వ పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేయడం నేరం.. దీనిపై ఎంపీడీఓ కి పిర్యాదు చేశాను.. పోలీసులకు కూడా సమాచారం ఇచ్చాను..ఉన్నతాధికారులు ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటాము.

# ఎల్ నినో దెబ్బకు డీలాపడ్డ ఆర్గానిక్ పంటలు





- ట్యాంకర్లతో పంటను కాపాడుకుంటున్న యువరైతు!
- మూడు ఎకరాల్లో రూ. 50 వేల పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయం
- వర్షాభావంతో ఎండిపోతున్న దోస, గుమ్మడి,గోకర
- రోజూ రూ. 2 వేలు పెట్టి ట్యాంకర్లతో నీటి సరఫరా
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు..

**మర్రిగూడ,ఆగస్టు 13(ప్రజా జ్యోతి):**

ఆధునిక పద్ధతుల్లో రసాయనాలు లేని పంటలు పండించి పదిమందికీ ఆదర్శంగా నిలవాలనుకున్న ఆ యువరైతు ఆశలపై వాతావరణం నీళ్లు చల్లింది. మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన గ్యార యాదగిరి అనే యువరైతు తనకున్న సొంత భూమిలో మూడు ఎకరాల్లో ఆర్గానిక్ పద్ధతిలో వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేపట్టాడు. వాతావరణ పరిస్థితులపై ఆధారపడి దోసకాయ, గుమ్మడికాయ, గోకరకాయ పంటలను వేశాడు. పంట సాగు కోసం ఇప్పటివరకు సుమారు రూ. 50,000 వరకు పెట్టుబడి పెట్టాడు.

**ఎల్ నినో ప్రభావం తలకిందులైన అంచనాలు**

ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో సంభవించిన ఎల్ నినోప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో, సరైన సమయానికి వర్షాలు కురవలేదు. కురవాల్సిన వర్షాలు పడకపోవడంతో విత్తనాలు మొలకెత్తి, పూత, కాత దశకు వస్తున్న సమయంలో పైర్లు ఎండిపోవడం ప్రారంభమయ్యాయి. కళ్లముందే పంట ఎండిపోతుంటే తట్టుకోలేకపోయిన యాదగిరి నిరాశ చెందినా, ధైర్యం కోల్పోకుండా పంటను ఎలాగైనా కాపాడుకోవాలని నిర్ణయించుకున్నాడు.

**రూ. 2,000 పెట్టి ట్యాంకర్ నీళ్లు!**

వర్షాలు పడకపోవడంతో వేరే దారి లేక, నిత్యం 5,000 లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంకర్‌ను రూ.2,000 చొప్పున కొనుగోలు చేసి చేనుకు పోస్తూ పంటను బతికించుకునేందుకు తాపత్రయపడుతున్నాడు. ఒకవైపు పెట్టిన పెట్టుబడి, మరోవైపు రోజువారీ నీటి ట్యాంకర్ల ఖర్చుతో ఆ రైతు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు.గురువారం ఈ యువరైతు పడుతున్న కష్టాలు 'ప్రజా జ్యోతి' దృష్టికి రావడంతో ఈ దయనీయ ఉదంతం వెలుగులోకి వచ్చింది.

**గ్యార యాదగిరి,యువరైతు, మర్రిగూడ**

రసాయనాలు లేని మంచి ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతోనే కష్టపడి ఆర్గానిక్ పంటలు వేశాను. ఎల్ నినో వల్ల వర్షాలు రాక పంట చేతికందే సమయంలో నీళ్లు లేక ఎండిపోతోంది. ఇప్పటికే 50 వేలు ఖర్చయింది. పంటను కాపాడుకోవడానికి రోజుకు రూ. 2,000 చొప్పున ట్యాంకర్ నీళ్లు పోస్తున్నా. ప్రభుత్వం,ఉద్యానవన శాఖ అధికారులు స్పందించి నాలాంటి ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు నష్టపరిహారం అందించి, ఉచితంగా డ్రిప్ లేదా నీటి వసతి కల్పించి ఆదుకోవాలి.

**యువ రైతుని ప్రభుత్వం ఆదుకోవాలి**

వాతావరణ మార్పుల వల్ల నష్టపోతున్న ఇటువంటి ఉత్సాహవంతులైన యువరైతులను ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు తక్షణమే సందర్శించి, అవసరమైన సాయం అందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# నామినేటెడ్ పదవి ఇప్పించాలంటూ ఎమ్మెల్యే కు బంటు రమేష్ వినతి

**మిర్యాలగూడ, ఆగస్టు 13,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ పట్టణంలో గడిచిన 14 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న తనకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరుతూ గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బంటు రమేష్ స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బి ఎల్ ఆర్)కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలోనే పార్టీ కోసం కష్టపడి పని చేశానని,కేసుల పాలై అనేక ఇబ్బందులు పడ్డానన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గెలుపు కోసం పాదయాత్ర చేశానని, ఎంపీ రఘువీర్ రెడ్డి విజయం కోసం కృషి చేశానని ఆ సమయం లో ఆర్థికంగా వెచ్చించి పార్టీ కోసం పనిచేశానన్నారు . కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన తన సేవలను గుర్తించి మార్కెట్ కమిటీ పాలకవర్గంలో అవకాశం కల్పించాలని కోరుతున్నానన్నారు . మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్,సహకార సంఘం చైర్మన్ పదవైన ఇవ్వాలని అభ్యర్థిస్తున్నానన్నారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



# యాదవ సంఘం నూతన నాయకులకు ఘన సన్మానం

## - సంఘం బలోపేతానికి కృషి చేస్తాం: రావుల సత్యనారాయణ, బోడ అశోక్ యాదవ్

**కొండమల్లేపల్లి, ఆగస్టు 13,(ప్రజాజ్యోతి):**

అఖిల భారత యాదవ సంఘం కొండమల్లేపల్లి మండల నూతన కమిటీ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రావుల సత్యనారాయణ, యువజన అధ్యక్షుడిగా ఎన్నికైన బోడ అశోక్ యాదవ్‌లను యాదవ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన నాయకులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రావుల సత్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. యాదవ సమాజానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సంఘం చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు యాదవుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు.యువజన అధ్యక్షుడు బోడ అశోక్ యాదవ్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో యువజన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘం నాయకులు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. యాదవ యువతను ఐక్యం చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. యువత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ముందుకు వెళ్లేందుకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. యాదవ సంఘం బలోపేతానికి, సంఘం



చేపట్టే ప్రతి కార్యక్రమానికి ముందుండి సహకరిస్తానని తెలిపారు.యాదవ సమాజంలో ఐక్యతను మరింత పెంపొందించడంతో పాటు యువతను సంఘటితం చేసి సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. పెద్దల సూచనలు, యువత సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో అబ్బనబోయిన లక్ష్మయ్య, పంగ దేవేందర్, బాతుక సత్తయ్య, రావుల వెంకటేశ్వర్లు, బోడ సత్తయ్య, నల్లగాసు వెంకటయ్య, జట్టమోని కృష్ణ, దూదిమెట్ల కొండల్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపి, వారి నాయకత్వంలో యాదవ సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ పాఠశాలకు మాజీ సర్పంచ్ వితరణ

## - ఎమ్మెల్యే భార్య కుమారుల చేతుల మీదుగా భోజన ప్లేట్లు,పండ్లు పంపిణీ





**మిర్యాలగూడ, ఆగస్టు 13,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ మేడ సురేందర్ రెడ్డి, సుచరిత దంపతులు వితరణ చాటారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు మరియు పండ్లు పంపిణీకి సంకల్పించారు.గురువారం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి సతీమణి మాధవి, కుమారుడు సాయి ప్రసన్నరెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ప్లేట్లు,పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు తమ వంతు సహకారం అందించటం అభినందనీయమన్నారు. గ్రామ అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తాము తప్పక చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని తెలిపారు. మేడ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూఉంటాయని అన్నారు.ఈ వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే సతీమణి మాధవి, కుమారుడు సాయి ప్రసన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలీమా,గ్రామ కార్యదర్శి రాధ, వార్డు సభ్యులు జానయ్య, అయోధ్య, లక్ష్మమ్మ, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బట్టు వెంకన్న, షాబుద్దీన్, బొంగరాల కిరణ్, బొప్పిడి శ్రీనివాస్ రెడ్డి, సంజీవ, ప్రసాద్, వీరబాబు, మేధా ఫౌండేషన్ ఫౌండర్స్ నాగరాజు, వేణు, మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ ఫోక్సో కేసులో నిందితుడికి 25 ఏళ్ల జైలు శిక్ష, 5 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు

## - మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఇదో గుణపాఠం
## - టూ టౌన్ సిఐ జెట్టి సోమ నరసయ్య

**మిర్యాలగూడ, ఆగస్టు 12,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణం లోని మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు మహమ్మద్ జాకీర్ బాబా కు గురువారం నల్లగొండ జిల్లా పోక్సో న్యాయస్థానం 25 సంవత్సరాల కారాగార శిక్ష,5 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి విశ్వనాథ్ కులకర్ణి దిలీప్ రావు తీర్పు వెలువరించారు. సంఘటన వివరాలను టూటౌన్ సిఐ సోమ నరసయ్య తెలిపారు.2020,మే,30న మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. నిందితుడు సోషల్ మీడియా ద్వారా మైనర్ బాలికతో పరిచయం పెంచుకుని, అనంతరం ఆమెను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడినట్లు అప్పట్లో కేసు నమోదైందన్నారు . ఈ కేసును అప్పటి స్టేషన్ హౌస్ ఆఫీసర్ డి శ్రీనివాస్ రెడ్డి చేసి దర్యాప్తు చేసి బలమైన ఆధారాలను కోర్టుకు సమర్పించారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ బలమైన వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ వాదనలు, సమర్పించిన ఆధారాలను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ శిక్ష విధించింది.ఈ కేసులో కిడ్నాప్ నేరానికి 5 సంవత్సరాల కారాగార శిక్ష,పోక్సో చట్టంలోని సెక్షన్ 3, 4 కింద 20 సంవత్సరాల కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధిత మైనర్ బాలికకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది.ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ వేముల రంజిత్ కుమార్ బలమైన వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ వాదనలు, సమర్పించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి శిక్ష విధించింది. ఎవరైనా మైనర్లపై అత్యాచారాలకు అఘాయి త్యాలకు పాల్పడితే ఈ శిక్ష ఒక గుణపాఠంఅవుతుందని సిఐ సోమ నరసయ్య హెచ్చరించారు.

# రైతులు ఆరుతడి పంటలు వేయాలి

## - ప్రత్యేక అధికారి పార్థసారథి



**గరిడేపల్లి,ఆగస్టు 13(ప్రజా జ్యోతి):**

ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సాగునీరు లేకపోవడంతో రైతులు పరిస్థితిని అర్థం చేసుకొని ఆరుతడి పంటలను వేసుకోవాలని సూర్యాపేట జిల్లా డిఎల్ పిఓ,తాడేపల్లి మండలం ప్రత్యేక అధికారి పార్థసారథి కోరారు.మండలంలోని మంగాపురం గ్రామంలో గురువారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు వర్షాభావ కారణంగా సాగర్ జలాశయంలో నీరు లేకపోవడంతో ప్రభుత్వం సాగునీటిని విడుదల చేసే పరిస్థితిలో లేదని,దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు అంతర్గత పంటలు వేసుకోవాలని ఆయన సూచించారు. రైతులంతా ప్రభుత్వానికి సహకరిస్తూ సాగు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుండు రామంజి గౌడ్,గుండు శంబయ్య, మంగాపురం కార్యదర్శి సుమిత్ర, గ్రామ సర్పంచ్ బత్తిని అంజయ్య వెంకటేశ్వర్లు,సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

**నాగారం ఆగస్టు 13 ప్రజా జ్యోతి.**

నాగారం మండల కేంద్రం తో మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనం వండి ముత్యాలమ్మ కు బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. మండల పరిధిలోని నరసింహుల గూడెం లో పోతరాజుల ఆటలు ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్ లు మహిళా ప్రజా ప్రతిందులు మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

## - ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కీ వెంకటయ్య

**హాలియా,ఆగస్టు13(ప్రజా జ్యోతి)**

హాలియా పట్టణంలోని స్వయంభూ వేంకటేశ్వరస్వామిని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కీ వెంకటయ్య, కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ,నేనావత్ రాంబాబు నాయక్‌లతో కలిసి శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.శ్రావణ మాస పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన కమిషన్ బృందానికి ఆలయ అధికారులు,అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం పండితులు కమిషన్ చైర్మన్, సభ్యులకు వేదాశీర్వచనం అందించి,స్వామివారి తీర్థప్రసాదాలను బహూకరించారు.దర్శనం అనంతరం బక్కీ వెంకటయ్య మాట్లాడుతూ పవిత్రమైన శ్రావణ మాసంలో స్వయంభూ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని సంతోషం వ్యక్తం చేశారు. ఏడుకొండలవాడి దివ్య కృపాకటాక్షాలతో తెలంగాణ రాష్ట్రం ఆయురారోగ్యాలు, సంతోషసౌఖ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురిసి,ప్రాజెక్టులు, జలాశయాలన్నీ జలకళతో తొలకడించాలని,రైతు సోదరులు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో హాలియా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్,కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు,బొంగరాల ఏసురాజు,కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు,చిట్టిప్రోలు కరుణాసాగర్,ఎడవల్లి రంజిత్, పురపాలక సిబ్బంది రవికుమార్, కరుణాకర్,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# భర్త భార్యల మృతదేహాలు నివాళులర్పించిన: కీసర సంతోష్ రెడ్డి....

**మోతె ఆగస్టు 13( ప్రజా జ్యోతి ):**

మోతె మండలం బీక్యతండా గ్రామానికి చెందిన ఇటీవల హత్య కాబడిన దంపతులు హలావత్ నాగులు - బూబ పార్థివ దేహాలకు పూలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు కీసర కీసర రెడ్డి మాట్లాడుతూ..... వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు , కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హలవత్ స్వామి, మాజీ ఎంపీటీసీ భాస్కర్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న : - కీసర సంతోష్ రెడ్డి

**మోతె ఆగస్టు 13( ప్రజా జ్యోతి ):**

మోతె మండల పరిధిలోని బిక్య తండకు చెందిన ధరావతు అనిత రామకృష్ణ ఏకైక కుమారుడు ధరావతు భువనేశ్వర్ నాయక్ పెద్దరాజుతం చెందిన బానోతు మోతిలాల్ బుజ్జి తృతీయ కుమార్తె సంధ్య లా నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న మోతే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి హలాత్ వెంకన్న ధరావత్ జాముల నాగేశ్వరరావు రాజు తదితరులు పాల్గొన్నారు.





# అక్రమ జలదోపిడీపై కాంగ్రెస్ మౌనం వీడాలి

## - వరుణ యాగాలు మాని కృష్ణా జలాలను కాపాడండి

## - మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ హెచ్చరిక

**హాలియా,ఆగస్టు13(ప్రజా జ్యోతి)**

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోతున్నా, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించడం అత్యంత శోచనీయమని నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ విమర్శించారు. గురువారం హాలియా పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు ఆంధ్రా ప్రభుత్వం కృష్ణా జలాలను యథేచ్ఛగా దోచుకెళ్తుంటే కళ్ళు మూసుకున్న కాంగ్రెస్ పార్టీ,రైతు సంక్షేమం పేరిట నాగార్జునసాగర్ లో వరుణ యాగం చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని దుయ్యబట్టారు.కృష్ణా నదిలో కేవలం మిగులు జలాలను మాత్రమే పోతిరెడ్డిపాడు ద్వారా వాడుకునే హక్కుఆంధ్రప్రదేశ్ ఉందన్న విషయాన్ని గుర్తుచేస్తూ, నికర జలాలను తరలించే హక్కు వారికి లేదని స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం 24 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే తీసుకెళ్లాల్సి ఉండగా,రోజుకు ఏకంగా 6 టీఎంసీల నీటిని అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయిలో నిండకుండానే పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తే,భవిష్యత్తులో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండే అవకాశం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరిపి నీటి అక్రమ తరలింపును అరికట్టాలని, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేయించేలా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులకు ఈ ప్రాంత రైతుల సంక్షేమం మరియు ప్రాంతీయ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే,వెంటనే శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించి అక్రమ నీటి తరలింపును అడ్డుకోవాలని ఆయన సవాల్ విసిరారు.లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కురాకుల వెంకటేశ్వర్లు,పిడిగం నాగయ్య, వడ్డే సతీష్ రెడ్డి,నల్గొండ సుధాకర్,వర్ర వెంకట్ రెడ్డి, కడమంచి శ్రీను,సురభి రాంబాబు,ఊర్లగొండ వెంకటయ్య,చిట్టీపోలు శ్రీనివాస్, చేగొండి కృష్ణ,కూరాకుల రవి యాదవ్,సైదా చారి,యడవెల్లి నాగరాజు కార్తీక్,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలు బోనాలు...!

## - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

## - తక్కెళ్లపాడు లో శ్రావణ మాస బోనాల మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**మిర్యాలగూడ, ఆగస్టు 13,(ప్రజాజ్యోతి):**

తెలంగాణ ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతికలు బోనాల పండుగలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. మిర్యాలగూడ మండలం తకెళ్లపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన శ్రావణ మాస బోనాల మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగాఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.శ్రావణ మాస బోనాల మహోత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు మహిళలు భారీ ఎత్తున తరలివచ్చారు. పోతురాజుల విన్యాసాలు, మేళతాళాలతో గ్రామంలో పండగ శోభ సంతరించుకుంది.గ్రామ ప్రజలకు,నిర్వాహకులకు ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ శుభాకాంక్షలు తెలిపారు.గ్రామంలో ఆధ్యాత్మికత, ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాలను కొనసాగిస్తూ ఇలాంటి పండుగలనుభక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండు నరేందర్ గౌడ్, సర్పంచ్ చిటికెల సుజాత జానయ్య, యాద్గార్పల్లి సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, దామరచర్ల మాజీ సర్పంచ్ బంటు కిరణ్, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.



# మహిళా భద్రతకే తొలి ప్రాధాన్యం

## - సమస్యలు ఎదురైతే ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలి- మల్కాపురం 'తెలుగు పచ్చళ్లు' కంపెనీలో మహిళా భద్రతపై అవగాహన సదస్సు- సీఐ జి. మన్మథ కుమార్






**చౌటుప్పల్, ఆగస్టు 13 ( ప్రజా జ్యోతి )**

మహిళలు, చిన్నారులపై జరిగే వేధింపులు, నేరాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చౌటుప్పల్ సీఐ జి. మన్మథ కుమార్ సూచించారు. దండు మల్కాపురం ఐటీ పార్క్‌లోని 'తెలుగు పచ్చళ్ళు' కంపెనీలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ఏమాత్రం భయాందోళనకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆపద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులను వేగంగా సంప్రదించే విధానాలపై పాల్గొన్న వారికి వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీఈడబ్ల్యూ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఎస్సీ,ఎస్టీలకు అన్యాయం జరగనివ్వం బాధితులకు అండగా ఉంటాం

## - రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య







**సూర్యాపేట ఆగస్టు 13(ప్రజా జ్యోతి):**

ఎస్సీ,ఎస్టీ వర్గాలకు అన్యాయం జరగకుండా వారి హక్కులు,సంక్షేమం కోసం కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.బాధితులకు అన్ని వేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు.గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిషన్ సభ్యులు,కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్,ఎస్పీ నరసింహ,ప్రజాప్రతినిధులు,జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఎస్సీ,ఎస్టీల భూముల సమస్యలు,దాడుల కేసులు,ఉద్యోగాలు,ప్రమోషన్లలో రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీల కోసం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సబ్ ప్లాన్ నిధులను పక్కాగా వినియోగించాలని,నిధులను దారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సబ్ ప్లాన్ నిధులు మిగిలితే ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో రోడ్లు,ఇతర అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు.ఉద్యోగాలు,ప్రమోషన్లలో ఎస్సీ,ఎస్టీలకు నిబంధనల ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని,ఈ విషయంలో అన్యాయం జరిగితే కమిషన్ ఉపేక్షించదన్నారు.ఎంపీ నిధులు,నియోజకవర్గ అభివృద్ధి నిధులు,ఎస్‌డీఎఫ్ నిధులను నిబంధనల ప్రకారం కేటాయించాలని సూచించారు.ఎస్సీ,ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసులను జాప్యం లేకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని,శిక్షల శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించారు.మున్సిపాలిటీలు,గ్రామపంచాయతీల్లో పెద్ద సంఖ్యలో ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన వారు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నందున వారికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

### నెలకు ఒకసారి సివిల్ రైట్స్ డే

బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రతి నెల చివరి వారంలో తప్పనిసరిగా 'సివిల్ రైట్స్ డే' నిర్వహించాలని ఎస్పీకి సూచించారు.ఈ కార్యక్రమాలకు స్థానిక ఎస్సైలు,తహసీల్దార్లు,సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.గ్రామాల్లో ఎస్సీ,ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### బాధితులకు ఇళ్లు, ఉపాధి కల్పించాలి

ఎస్సీ,ఎస్టీ దౌర్జన్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారాన్ని త్వరితగతిన అందించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు,ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.'భూభారతి' ద్వారా ఎస్సీ, ఎస్టీల భూ సమస్యల పరిష్కారానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### కలెక్టర్,ఎస్పీల పనితీరుపై ప్రశంసలు

సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు,ఎస్సీ,ఎస్టీ సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఇచ్చిన ప్రజెంటేషన్ అద్భుతంగా ఉందని బక్కి వెంకటయ్య ప్రశంసించారు.ప్రతి అంశంపై పూర్తి సమాచారంతో ప్రణాళికలు సిద్ధం చేసి కలెక్టర్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని కొనియాడారు.అదేవిధంగా కేసుల పరిష్కారం,శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్పీ నరసింహ వినూత్నంగా ముందుకు సాగుతున్నారని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, శంకర్,అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్,ఎస్సీ డీడీ లత,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

## - సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.- యూఎస్పీసీ

**నడిగూడెం, ఆగస్టు13, ప్రజా జ్యోతి:**

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూఎస్పీసీ ఆధ్వర్యంలో 29 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నడిగూడెం మండల గిర్దావర్ కొండపల్లి గోపాలకృష్ణ ద్వారా ముఖ్యమంత్రికి సమర్పించారు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న 6 డీఏల మంజూరు, పెండింగ్ బిల్లులకు ప్రతి నెల రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు, హెల్త్ కార్డుల సక్రమ అమలు, 25 జీవో సవరణ, పర్యవేక్షక పోస్టుల భర్తీతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకులఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో



టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కామల్ల గోపయ్య, టీపీటీఎఫ్ బాధ్యులు ఎండీ మౌలానా, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు కత్తి వెంకటేశ్వర్లు, టీజీయూఎస్ అధ్యక్షుడు బి. సైదులు, టీఎన్‌జీవో అధ్యక్షుడు చిలకల ఉపేందర్, సీనియర్ నాయకులు గోపతి ఉపేందర్‌రావు, పట్ల శ్రీధర్, తోడేటి బాబు, ఏపూరి పర్వతాలు, బిల్దే వెంకటేశ్వర్లు, రాయపూడి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**దామరచర్ల, ఆగస్టు 13,( ప్రజాజ్యోతి ):**




మండల కేంద్రమైన దామరచర్ల శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్లోని ప్రకాశం జిల్లా, సంతమాగులూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన దొడ్డ పూరి హరిబాబు(45) హైదరాబాద్ నుండి తన స్వగ్రామానికి యాక్టీవ వాహనంపై వెళ్తుండగా దామరచర్ల శివారు జాన్ పహాడ్ అడ్డ రోడ్డు వద్ద మిర్యాలగూడ వైపు నుండి దామరచర్ల వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న వాడపల్లి పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ కోడి రెక్క జ్యోతి తెలిపారు.

# తిరుమలగిరిలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవం

**దేవరకొండ,పి ఏ పల్లి, ఆగస్టు 13,(ప్రజా జ్యోతి):**

పి.ఏ.పల్లి మండలం తిరుమలగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని దేవరకొండ శాసనసభ్యులు రామవత్ బాలు నాయక్ గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరుమలగిరి గ్రామ సర్పంచ్ బెల్లి కృష్ణమ్మ ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి నూతన పంచాయతీ భవనాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ వేడుకలో ఉప సర్పంచ్, మండల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది మరియు తిరుమలగిరి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# కల్మలచెరువులో ప్రత్యక్షమైన జాతీయ పక్షి నెమలి.. అధికారులకు అప్పగింత

**గరిడేపల్లి,ఆగస్టు 13 (ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామంలో జాతీయ పక్షి నెమలి ప్రత్యక్షం కావడంతో స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాంరెడ్డి ఇంటి వద్ద నెమలిని గుర్తించారు. నెమలిని చూసిన వెంటనే సీతారాంరెడ్డి అప్రమత్తమై, దానికి ఎలాంటి హాని కలగకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం అటవీ శాఖ బీట్ ఆఫీసర్ శ్రీనివాస్‌కు నెమలిని సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీతారాంరెడ్డి మాట్లాడుతూ జాతీయ పక్షి నెమలిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వన్య ప్రాణులు గ్రామాల్లోకి వచ్చినప్పు డు వాటికి ఎలాంటి హాని కలిగించకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని



సూచించారు. నెమలిని సురక్షితంగా అధికారులకు అప్పగించడం ద్వారా సీతారాంరె డ్డి బాధ్యతాయుతంగా వ్యవహ రించడంపై స్థానికులు అభినందించారు. నెమలి గ్రామంలో ప్రత్యక్షం కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో మీసాల యోహాను,బొల్లగాని సైదులు, అనిల్‌రెడ్డి,రవీందర్‌రెడ్డి,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులు మాత్రమే వాడాలి



**నూతనకల్..ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):**

పంటలకు అనుగుణంగా ఎరువులు పురుగుల మందులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించుకోవాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ జోనల్ మార్కెటింగ్ మేనేజర్ రాజేష్ రైతులకు సూచించారు.. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో మన గ్రోమోర్ ఆద్వర్యంలో స్థానిక సర్పంచ్ మాదాసు వెంకన్న అధ్యక్షతన రైతులతో సాగ్రాన్ సంకల్ప యాత్ర రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి, పత్తి పంటలలో పిచికారి చేసేందుకు సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగించాలన్నారు.. వాటి ప్రయోజనాలు వినియోగ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులతో వ్యవసాయం భూములు నాణ్యతను కోల్పోకుండా కాపాడుకోవొచ్చు అని చెప్పారు.. ఈ కార్యక్రమంలో ఏరియా మార్కెటింగ్ మేనేజర్ తిరుపతి రెడ్డి, మేనేజర్లు చిరంజీవి, వెంకటేష్, సైదులు, కరుణాకర్, నాగరాజు, అంజయ్య, సురేష్, యాదగిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు..



# సునంద రైస్ మిల్లుపై కఠిన చర్యలు తీసుకోవాలి

## - రూ.22 కోట్ల నష్టం రికవరీ చేసి, లైసెన్స్ రద్దు చేయాలి
## - ఎంఆర్పీఎస్ గరిడేపల్లి మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవి

**గరిడేపల్లి,ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):**

సునంద రైస్ మిల్లుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్పీఎస్ గరిడేపల్లి మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు.గురువారం సునంద రైస్ మిల్లు ముందు ఎంఆర్పీఎస్,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు.మిల్లులో 8 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం మాయమై,రూ.22 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం జరిగినట్లు విజిలెన్స్,సివిల్ సప్లైస్ అధికారు ల తనిఖీల్లో వెలుగులోకి వచ్చిందన్నారు.ఈ వ్యవహారంలో మిల్లు భాగస్వాములు,అకౌంటెం ట్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారని తెలిపారు. ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి వెంటనే రికవరీ చేయాలని,మిల్లు లైసెన్స్‌ను రద్దు చేసి శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం,ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మిల్లుకు మళ్లీ అనుమతి ఇస్తే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో జై భీమ్ కమిటీ ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రవి, ఎంఆర్పీఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ట వెంకటేష్‌తో పాటు పలువురు నాయకులు, మహిళలు,యువత పాల్గొన్నారు.



# నకిరేకల్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడాలని

## AICC ఇన్‌చార్జీకి దైద రవీందర్ విజ్ఞప్తి



**నకిరేకల్ ఆగస్టు 13 ప్రజా జ్యోతి**

హైదరాబాద్: గాంధీభవన్‌లో గురువారం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ూ×జజ) కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సచిన్ సావంత్‌ను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పార్టీ జెండాను మోస్తూ, ప్రజల మధ్య ఉంటూ పార్టీ కోసం పోరాడిన నాయకులు, కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడాలని సచిన్ సావంత్‌కు దైద రవీందర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న తన ఆత్మీయ కుటుంబ సభ్యులైన నాయకులు, కార్యకర్తలకు సముచిత గౌరవం, గుర్తింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమస్యలను ూ×జజ దృష్టికి తీసుకెళ్లినట్లు దైద రవీందర్ తెలిపారు.